సాక్షి
పార్వతీపురం మన్యం


గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



అంగన్వాడీ సెంటర్లకు రూ.2.55 కోట్లు కేటాయింపు

జిల్లాలోని అంగన్‌వాడీ సెంటర్లలో మంచినీరు, టాయిలెట్స్ ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

- 8లో



ఫేక్ రిసీప్ట్‌తో డ్రామా..!

- 8లో

వీరఘట్టం మండలం పాలమెట్టకు చెందిన ఓ వ్యక్తి ఫేక్ రిసీప్టుల బాగోతం బయటపడింది. సంఘ సభ్యులు కట్టాల్సిన డబ్బులు కాజేయడంపై బ్యాంకు అధికారులకు ఫిర్యాదు అందింది.



మక్కువలో టీడీపీకి ఎదురుదెబ్బ

తెలుగుదేశం పార్టీ మక్కువ మాజీ మండలాధ్యక్షుడు పెంట తిరుపతిరావు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. జనసేన పార్టీలో చేరారు.

- 8లో



తల్లికి వందనం ఇంకా అందలేదు..



నాకు ముగ్గురు పిల్లలు. వారు ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. నా భర్త మరణంతో పిల్లల బాధ్యత, కుటుంబ నిర్వహణ నాపై పడింది. గతంలో అమ్మఒడి వరుసగా వచ్చింది. నూతన ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి సహకారం అందించలేదు. ఎంతమంది చదివితే అందరికీ తల్లికి వందనం అమలు చేయాలి. – జి.ధనలక్ష్మి, ఒంటరి మహిళ, పాలకొండ పట్టణం.

రూ.1500లు ఎప్పుడిస్తారు?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు ప్రతీ నెల రూ.1500 ఇస్తామన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఆ డబ్బులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆ హామీపై ఇంతవరకు ఎలాంటి ప్రకటన లేదు. ఎన్నికలలో చెప్పిన మాట ప్రకారం ప్రతీ నెలా రూ.1500లు చెల్లిస్తారని మహిళలు ఆశగా ఉన్నారు.

– పి.విజయ, శివ్వాం, గరుగుబిల్లి మండలం

ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు



నా పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివించుకుంటున్నాను. గత ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద అందించిన ఆర్థిక సాయంతో పిల్లల చదువుల ఫీజులు చెల్లించాం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. ఇంత వరకు అమలు చేయలేదు. పాఠశాల యాజమాన్యం పిల్లల ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తోంది.

– దోకుల రమ, గృహిణి, పెద్దూరు, గరుగుబిల్లి

ఎప్పుడిస్తారో తెలియడంలేదు..



వర్షాకాలం కావడంతో కట్టెలు లేక వంట చేసుకోవడం కష్టంగా మారింది. అన్ని పూటలా గ్యాస్‌పైనే వంట చేస్తే సిలిండర్ ఎప్పుడు అయిపోతుందోనని భయం. నెలనెలా కొత్త సిలిండర్ విడిపించేంత స్థోమత లేదు. ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తానంది. ఆ హామీ అమలు చేస్తే మాలాంటి కుటుంబాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎప్పరిక మిస్సమ్మ, గిరిజన మహిళ, మూల జమ్ము గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం

నిరుద్యోగ భృతి ఏమైంది?



ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి సూపర్ సిక్స్ హామీల్లో నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారం చేపట్టి వందరోజులు కావొస్తోంది. ఇంకా నిరుద్యోగ భృతి అమలు చేయడం లేదు. నాకు ఉద్యోగమైనా ఇవ్వాలి. లేదా ఉద్యోగం వచ్చేలోపు నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలి. ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపాలి.

– కోలక మోహనరావు, నిరుద్యోగి, కొందుకుప్ప గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం



బాబు ష్యూరిటీ..
వంచన గ్యారంటీ!

- అధికారంలోకి వచ్చి సుమారు రెండునెలలవున్నా సూపర్‌సిక్స్ మాటెత్తని కూటమి నేతలు
- సూపర్ సిక్స్ చూస్తే భయమేస్తోందంటూ చంద్రబాబు నిట్టూర్పు
- పరిశీలిస్తాం.. శోధిస్తామంటూ కల్లబొల్లి మాటలు
- మోసపోయామంటున్న ప్రజలు

అధికారంలోకి వచ్చి సుమారు వంద రోజులు కావస్తోంది. సూపర్ సిక్స్ అంటూ చంద్రబాబునాయుడు ప్రజలకిచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కటీ అమలుకు నోచుకోలేదు. విద్యాసంవత్సరం ఆరంభమై మూడునెలలవుతున్నా 'తల్లికి వందనం' అందని దుస్థితి. ఖరీఫ్ పనులు చురుగ్గా సాగుతున్నా రైతన్నచేతికి అందని భరోసా. తెలంగాణాలో అధికారంలోకి వచ్చిన వెంటనే అమల్లోకి వచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇక్కడ ఎండమావిగానే మిగిలింది. సూపర్ సిక్స్‌లోని నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు, మహిళలకు నెలకు రూ.1500, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీదీ అదే పరిస్థితి. దీనిని చూసిన పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు.. బాబు మారలేదు.. మనమే మోసపోయామని నిట్టూర్చుతున్నారు. సూపర్ సిక్స్ అంటూ వంచనకు గురిచేశారని వాపోతున్నారు. పథకాలు ఎందుకు అమలుచేయడంలేదంటూ గల్లీ నాయకులతో పాటు రాష్ట్రస్థాయి లీడర్లను నిలదీస్తున్నా ఫలితం శూన్యంగానే కనిపిస్తోంది. అసలు పథకాలను అమలుచేస్తారా? లేదా? అన్న సందేహాన్ని వ్యక్తంచేస్తున్నారు.

– సాక్షి, పార్వతీపురం మన్యం

పెట్టుబడి భరోసా ఏది బాబూ?



నా పేరు ఆలవట్టం శ్రీనివాసరావు. మాది పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు నియోజకవర్గం, మక్కువ మండలంలో నాకు రెండు ఎకరాలు పొలం ఉంది. గత ప్రభుత్వంలో ఏటా ఖరీఫ్‌సాగు సమయానికి వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాలో జమయ్యేది. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు రైతులమంతా సమాయత్తమయ్యాము. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, దమ్ము, ఉభాలు జరిపించేందుకు ఎకరానికి సుమారు రూ.25వేల నుంచి రూ.30వేలు పెట్టుబడి అవుతుంది. కూటమి ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం తక్షణమే జమచేయాలి. సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టి రైతులను ఆదుకోకపోతే ఎలా?

ఉచిత ప్రయాణ మెప్పుడు?



అధికారంలోకి వస్తూనే ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణమని దండోరా వేసి మరీ చెప్పారు. అధికారంలోకి వచ్చి వందరోజులవుతోంది. ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నాం. ఇచ్చిన హామీని త్వరగా అమలు చేయాలి. ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికల తర్వాత మరోలా మాటమార్చడం సరైనది కాదు. మోసం చేయొద్దు.

– రమణమ్మ, పార్వతీపురం

సూపర్‌సిక్స్ హామీలతో దగా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలకు రూ.లక్షల కోట్లు ధారపోసి, రాష్ట్రాన్ని అప్పులపాల్జేస్తున్నారని కూటమి నాయకులు గగ్గోలు పెట్టారు. శ్రీలంక, వెనిజులా మాదిరి తయారు చేస్తారేమోనని విషం వెళ్లగక్కారు. అదే సంక్షేమ పథకాల పేరు మార్చి, తమ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ హామీలుగా చంద్రబాబు విస్తృత ప్రచారం చేశారు. గత ఎన్నికలకు ముందు జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ పర్యటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏమేం చేస్తామో మైకుల్లో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి సుమారు రెండు నెలలుకావస్తున్నా సూపర్ సిక్స్‌లో ఒక్క పథకం అమలుకు నోచుకోలేదు. కనీసం దానిగురించి ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

తమ్ముళ్లా వచ్చేది మంచి పాలన. సూపర్ సిక్స్‌తో అందరినీ ఆదుకుంటాం. నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేవరకు రూ.3వేలు నిరుద్యోగభృతి ఇస్తాం, 20 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తాం.. బడికి వెళ్లే ప్రతీ విద్యార్థికి రూ.15వేలు చొప్పున అందజేస్తాం.. మహిళలకు బస్సు ఫ్రీ.. పేద కుటుంబాలకు ఏడాదికి మూడు గ్యాస్ బండలు ఉచితం.. 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలందరికీ నెలకు రూ.1500 చొప్పున ఇస్తాం.. రైతన్నకు పెట్టుబడి భరోసాతో ఆదుకుంటాం.. అధికారంలోకి వచ్చిన నుంచి పథకాలన్నీ అమలుచేస్తాం.. ఇంటింటికీ వెళ్లి మన సూపర్ సిక్స్ పథకాల గురించి చెప్పండి.

– మే 10వ తేదీన కురుపాం మండల కేంద్రంలో చంద్రబాబు సూపర్ సిక్స్ గురించి పదేపదే చెప్పిన మాటలివి.



నేడు

ప్రతి బిడ్డకూ కాదు.. ఒక్కరికీ లేదు!



తాము అధికారంలోకి వస్తే చదువుకుంటున్న ప్రతి బిడ్డకూ 'తల్లికి వందనం' పథకం కింద రూ.15,000 చొప్పున అందిస్తామని ప్రకటించారు. జిల్లాలో 1,584 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిల్లో 91,856 మంది చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలలు మరో 109 ఉండగా.. ఇందులో 27,034 మంది చదువుతున్నారు. కుటుంబంలో ఒకరు ఉంటే రూ.15,000, ఇద్దరుంటే రూ.30 వేలు, ముగ్గురుంటే రూ.45 వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో చదువుతున్న పిల్లలందరికీ అమలు చేయాలన్నా... లక్ష మందికిపైగా లబ్ధి పొందుతారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనూ మంత్రి లోకేశ్ దీనిపై స్పష్టత ఇవ్వలేదు. ఇంకా విధివిధానాలు రూపొందిస్తున్నామని మాత్రమే ప్రకటించారు.

తల్లికి వందన కోసం ఎదురుచూస్తున్నవారి సంఖ్య

1,00,000

నాడు

విద్యాసంవత్సరం ఆరంభంలోనే..



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలోనే రూ.15 వేలు చొప్పున అమ్మఒడి పథకం నిధులను తల్లుల ఖాతాలకు జమచేసి పిల్లల చదువుకు తోడ్పడేవారు.

అమ్మ ఒడి లబ్ధి ఇలా...		
సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
2019-20	83,821	125.73
2020-21	74,890	112.33
2021-22	86,409	129.13
2022-23	83,733	129.61

గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమ్మఒడి కింద జిల్లాలోని లబ్ధిదారులకు అందించిన సాయం

రూ.496.08 కోట్లు

చంద్రన్నా.. ఆడబిడ్డ నిధి ఏదన్నా!



సూపర్-6లో ఆడబిడ్డ నిధి ఒకటి. ఈ పథకంలో భాగంగా నెలకు రూ.1,500 ఇస్తామని.. ఇద్దరు మహిళలు ఇంట్లో ఉంటే రూ.3 వేలు, ముగ్గురు ఉంటే రూ.4,500, నలుగురు ఉంటే రూ.6 వేలు ఇస్తామని.. దీనికి ఎలాంటి ఆంక్షలూ లేవని స్పష్టం చేశారు. ఈ డబ్బుతో మరింత డబ్బు ఎలా సంపాదించాలో కూడా నేర్పిస్తానని నమ్మబలికారు. ఇప్పటి వరకు ఒక మహిళకు కూడా రూ.1,500 చొప్పున ఇవ్వలేకపోయారు.

మహిళకు అండగా గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు ఎప్పుడూ అండగా నిలిచేది. వైఎస్సార్ చేయూత కింద 2020 నుంచి 2023 సంవత్సరాల్లో 554.50 కోట్లు అందించింది. జిల్లాలో ఏడాదికి సగటున 75 వేల మంది లబ్ధి పొందేవారు. వైఎస్సార్ ఆసరా ద్వారా మహిళా సంఘాల సభ్యులకు రూ.కోట్లలో లబ్ధి కలిగింది. మహిళల పేరున లక్షలాదిరూపాయలు విలవచేసే ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చింది.

గత ప్రభుత్వం వైఎస్సార్ చేయూత కింద అందించిన లబ్ధి **రూ.554.50 కోట్లు**

ఉచిత ప్రయాణం ఉఫ్..



కూటమి ప్రభుత్వ హామీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఒకటి. వచ్చే ఆగస్టు 15 నుంచి దీనిని అమలు చేస్తామని చెబుతున్నప్పటికీ.. ఇప్పటి వరకూ అధికారిక ప్రకటన లేదు. జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 4,70,717 మంది మహిళలు ఉండగా.. ఇటీవల ఎన్నికల జాబితా ప్రకారం మహిళా ఓటర్లు 4,00,779 మంది ఉన్నారు. వీరందరికీ ఉచిత ప్రయాణం కల్పిస్తారా.. లేక బీపీఎల్ కుటుంబాలను ప్రామాణికంగా తీసుకుని జిల్లాలో ఉన్న 2,81,251 కుటుంబాలకు మేలు కలిగిస్తారా అన్నది చూడాలి. ఇప్పటికైతే ఏ విధంగా అమలు చేస్తారన్నదానిపై ఒక విధివిధానమంటూ ప్రభుత్వం వెల్లడించలేదు. కూటమి ప్రభుత్వం నిర్ణయం కోసం మహిళలంతా వేచిచూస్తున్నారు.

ఉద్యోగమన్నావ్.. నిరుద్యోగ భృతి ఇస్తానన్నావ్!



క్రమం తప్పకుండా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తూ, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు చెప్పారు. ఉద్యోగం ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు చొప్పున భృతి కల్పిస్తామని ప్రకటించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో దాదాపు లక్షా 30 వేల మంది వరకు నిరుద్యోగులున్నట్లు అంచనా. వీరు కాక, ఏటా 12 వేల నుంచి 15 వేల మంది ఇంటర్మీడియట్, 7,500 నుంచి 8 వేల మంది వరకు డిగ్రీ విద్యను పూర్తి చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో చదువుతున్న వారితోపాటు.. ఇంజినీరింగ్ వంటి పలు కోర్సులు చేస్తున్న వారూ అనేకమంది ఉన్నారు. వీరంతా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారు.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాలతో వేలాది ఉద్యోగాలను భర్తీ చేసింది. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 350 సచివాలయాలుండగా.. 3,500 మంది వరకు వీటిలో శాశ్వత ఉద్యోగాలు పొందారు. వీరితోపాటు.. గౌరవ వేతనంతో 5,600 మంది వలంటీర్లను నియమించింది. జిల్లాలోని నాలుగు స్కిల్ హబ్‌లు, నైపుణ్య కళాశాల, ఈఎస్‌సీ కేంద్రాలు వంటి వాటి ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణలు ఇప్పించి, వివిధ కంపెనీల్లో వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు.


నెత్తిన 'బండేనా'..



సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని కూటమి ప్రభుత్వం పేర్కొంది. జిల్లాలో 2,45,070 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 13 వేలకుపైగా ఉజ్వల కనెక్షన్లు ఉన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత సిలిండర్లు అమలు చేస్తే కొంతయినా ఆర్థిక భారం తప్పుతుందని లక్ష మందికిపైగా ఉన్న రాయితీ గ్యాస్ వినియోగదారులు ఎదురు చూస్తున్నారు.

నేడు

రైతుకు 'సాయం' దక్కేనా?



రైతుకు ఏటా రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఖరీఫ్ సగం పూర్తయినా నేటికీ సాయం ఊసే లేదు. గత జూన్‌లో కేంద్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి తొలివిడత సాయంగా రూ.2 వేలు చొప్పున జమ చేసింది. జిల్లాలో 1,13,865 మంది రైతులకు రూ.22.77 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఈ మొత్తం కేంద్రం వాటా కాగా.. రాష్ట్రం అందించాల్సిన సాయంపై నేటికీ స్పష్టత లేదు.

నాడు

సీజన్ వారీగా సాయం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగు పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఆరంభంలోనే పెట్టుబడి సాయం(వైఎస్సార్ రైతు భరోసా) అందిస్తూ అండగా నిలిచేది. పీఎం కిసాన్ సాయం రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి రూ.13,500 మొత్తాన్ని ఖరీఫ్ ఆరంభం, కోతల సమయం, రబీ ఆరంభంలోగానీ.. ధాన్యం ఇంటికి చేరే వేళగానీ మూడు విడతలుగా అందించేవారు. గత ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద జిల్లాలోని రైతులకు రూ.885.69 కోట్లను అందించారు.

పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నవారి సంఖ్య **1,13,865**

గత ఐదేళ్లలో అందించిన సాయం		
సంవత్సరం	రైతు కుటుంబాలు	నిధులు (రూ.కోట్లలో)
2019-20	1,07,729	145.43
2020-21	1,29,027	174.19
2021-22	1,34,657	181.79
2022-23	1,39,505	188.050
2023-24	1,46,016	196.236

గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సాయం **రూ.885.69 కోట్లు**



క్లుప్తంగా

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని సారిక గ్రామంలో గల చెరువులో ఈతకు వెళ్లిన ఐదుగురులో గల్లంతైన వ్యక్తి (తోట సూరిబాబు) మృతి చెందినట్లు రూరల్ ఎస్సై వి.అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం గల్లంతు కాగా అప్పటి నుంచి పోలీసులు గజ ఈతగాళ్లచే గాలింపు చేపట్టగా బుధవారం మృతదేహం లభించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య


యోగీశ్వరరావు (ఫైల్)

రేగిడి: మండలంలోని ఏవీపురం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్(బీటెక్) చదువుతున్న విద్యార్థి గోగుల యోగీశ్వరరావు(20) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎస్సై పి.నీలావతి తెలిపిన వివరాల ప్రకారం రాజాంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో యోగీశ్వరరావు బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. చదువులో వెనుకబడుతున్నాననే భావనతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిపై ఉన్న రూమ్‌లో ఉరివేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కామినాయుడు, సత్యవతి గగ్గోలు పెట్టగా, చుట్టుపక్కల ప్రజలు వచ్చి తలుపులు పగలగొట్టి యోగీశ్వరరావును కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని, తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై తెలియజేశారు. యోగీశ్వరరావు మృతదేహాన్ని చూసేందుకు అతని స్నేహితులు తండోపతండాలుగా ఏవీపురం గ్రామానికి చేరుకున్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


వావిలపల్లి బంగారినాయుడు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు వావిలపల్లి బంగారినాయుడు(101) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. వారంరోజుల క్రితం వరకూ ఆయన ఆరోగ్యంగానే ఉండేవారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆయన 35 సంవత్సరాల పాటు బూరాడ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందించారు. అన్ని వర్గాలు, పార్టీల మన్ననలు పొందారు. ప్రస్తుతం ఆయన కుమారుడు వావిలపల్లి జగన్మోహనరావు రేగిడి మండల వైస్ ఎంపీపీగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రేగిడి మండల అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన మృతి పట్ల వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు తదితరులు జగన్మోహనరావును కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


చంద్రశేఖర్ మృతదేహం

రామభద్రపురం: మండలకేంద్రంలోని వసంతల వీధికి చెందిన ఓ వ్యక్తి విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు వసంతుల వీధికి చెందిన పూడి చంద్రశేఖర్(38) కొంత కాలం నుంచి ఫిట్స్ వ్యాధితో పడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం బాత్‌రూమ్‌కు వినియయోగించే యాసిడ్ తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు ప్రథమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య రాజేశ్వరి, కుమార్తె రిత్విక, మోక్షిత్ ఉన్నారు. మృతుని తమ్ముడు మురళీకృష్ణ ఫిర్యాదుమేరకు ఏఎస్సై ఐవీ రమణ కేసునమోదు చేశారు.

పశువుల శాలకు నిప్పు


బూడిదైన పశువుల శాల

గంట్యాడ: మండలంలోని వసంత గ్రామంలో చలుమూరి అప్పారావుకు చెందిన పశువుల శాలకు మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో శాల కాలి బూడిదైంది. శాల బయటకట్టి ఉన్న ఆవు పొట్టపై నిప్పురవ్వలు పడడంతో కొంత మేర ఆవు కాలింది. గతంలో కూడా ఇదే ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు పశువులశాలలకు నిప్పు పెట్టడంతో రెండు ఆవులు చనిపోయాయి. మళ్లీ ఇప్పుడు పశువుల శాలకు నిప్పుపెట్టారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

అంగన్వాడీ సెంటర్లకు రూ.2.55 కోట్లు కేటాయింపు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలోని అంగన్‌వాడీ సెంటర్లలో మంచినీరు, టాయిలెట్స్ ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన లక్ష్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల, విద్య, స్కిల్ డెవలప్‌మెంట్, మున్సిపల్, మెప్మా, టిడ్కో, ఇంజినీరింగ్, ఉపాధిహామీ, సెర్ప్, హ్యాండ్‌లూమ్, వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్స్, ఐసీడీఎస్, వైద్యశాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు, చేరుకున్న లక్ష్యాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 469 అంగన్వాడీ సెంటర్లలో టాయిలెట్స్ నిర్మించేందుకు ఒక్కో సెంటర్‌కు రూ.36వేలు చొప్పున రూ.1,68,84,000లు, 512 సెంటర్లలో మంచినీటి సదుపాయం కోసం ఒక్కో సెంటర్‌కు రూ.17వేలు చొప్పున రూ.87,04,000లు మొత్తం 981 పనులకుగాను రూ.2,55 కోట్ల నిధులను మహిళాశిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌తో చర్చించి విడుదల చేయించినట్లు తెలిపారు. పనులు చేపట్టేందుకు ఆ నిధులు జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగానికి అందాయని, పనులు వెంటనే మొదలుపెట్టి త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పురపాలక శాఖకు సంబంధించి పార్వతీపురంలో అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని, పాలకొండలో అన్నా క్యాంటీన్ పనులు పూర్తికావస్తున్నట్లు తెలిపారు. హ్యాండ్‌లైమ్ అండ్ టెక్స్‌టైల్స్ అధికారులు కనీస లక్ష్యాలను పూర్తిచేయక పోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, ముఖ్య ప్రణాళిక అధికారి వీర్రాజు, డీఆర్‌డీఏ పీడీ వైసత్యం నాయుడు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, జిల్లా విద్యాశాఖాధికారిణి జి. పగడాలమ్మ, ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మక్కువలో టీడీపీకి ఎదురుదెబ్బ

- జనసేనలో చేరిన ఆ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు


జనసేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ శివశంకర్ సమక్షంలో పార్టీలో చేరిన తిరుపతిరావు

మక్కువ: తెలుగుదేశం పార్టీ మక్కువ మాజీ మండలాధ్యక్షుడు పెంట తిరుపతిరావు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. జనసేనలో చేరారు. విశాఖపట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ టి.శివశంకర్ తిరుపతిరావుకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. తిరుపతిరావుతో పాటు ఏ.వెంకంపేట సర్పంచ్, మాజీ ఎంపీపీ పెంట ఉమా, ఎంపీటీసీ సభ్యుడు దొడ్డి సాయిబాబా, ఎ.వెంకంపేట జిల్లాపరిషత్ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పారాది రామారావు, కోన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు భర్త దాకేటి రామకృష్ణతోపాటు, పలువురు జనసేనలో చేరారు. అనంతరం పార్వతీపురం నియోజకవర్గ సేనసేన ఇన్‌చార్జి ఆదాడ మోహనరావుతో కలిసి జనసేన పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బొలిశెట్టి సత్యానారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు.

కూటమి కలిసేనా?

ఎన్నికల ముందు ప్రస్తుత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మక్కువ మండలం టీడీపీ మండలాధ్యక్షుడుగా గుళ్ల వేణుగోపాలరావును నియమించారు. అప్పటి నుంచి ఇద్దరూ సమావేశాలు సాక్షిగా పరస్పర ఆరోపణలు చేశారు. ఇప్పుడు తిరుపతిరావు జనసేనలో చేరడంతో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం మధ్య సఖ్యత చర్చనీయాంశంగా మారింది.

అదరగొట్టిన అక్కాచెల్లెళ్లు

- అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన వెయిట్ లిఫ్టర్లు
- కామన్‌వెల్త్ చాంపియన్‌షిప్‌లో పతకాలు


సాధించిన పతకాలను చూపిస్తున్న బెల్లాన హారిక, భార్గవి

నెల్లిమర్ల రూరల్: వెయిట్ లిఫ్టింగ్ అంటే ఠక్కున గుర్తొచ్చే ఊరి పేరు నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ. ప్రతిభ ఉంటే వేదికతో సంబంధం లేదని నిరూపిస్తున్నారు ఆ గ్రామానికి చెందిన క్రీడాకారులు. పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటి పతకాలు సాధిస్తూ జిల్లా, గ్రామం పేరును ఇనుమడిస్తున్నారు. ఈ నెల 16 నుంచి 20 వరకు ఫిజి దేశంలో జరుగుతున్న యూత్ జూనియర్ అండ్ సీనియర్ కామన్‌వెల్త్ పోటీల్లో కొండవెలగాడకు చెందిన బెల్లాన శ్రీను, గౌరీ దంపతుల కుమార్తెలు బెల్లాన భార్గవి, హారిక ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్నారు. ఈ క్రమలో మంగళవారం రాత్రి జరిగిన పోటీల్లో భార్గవి 49 కేజీల విభాగంలో స్నాచ్ 69 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 86 కిలోలు మొత్తం 155 కిలోల బరువును ఎత్తి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే బుధవారం జరిగిన పోటీల్లో హారిక 64 కేజీల విభాగంలో స్నాచ్ 81 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 105 కిలోలు మొత్తం 186 కేజీల బరువును ఎత్తి రెండు రజత పతకాలను దక్కించుకుంది. అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన అక్కాచెల్లెళ్లను రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రెసిడెంట్ నీలంశెట్టి శ్రీలక్ష్మి, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్క కార్యదర్శి చల్లా రాము, కోచ్ వల్లూరి శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం


రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

- అండర్-14, 17 విభాగాల్లో 44 మంది క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లాస్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అండర్-14,17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో అండర్-14 బాలుర జట్టుకు 11 మంది క్రీడాకారులు, బాలికల జట్టుకు 11 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అదేవిధంగా అండర్-17 విభాగంలో బాలుర జట్టుకు 11 మంది క్రీడాకారులు, బాలికల జట్టుకు 11 మంది క్రీడాకారులు అర్హత సాధించారు. అండర్-14 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు సత్యసాయి జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో, అండర్-17 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు పల్నాడులో జరగనున్న అంతర్‌జిల్లాల పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపిక పోటీలను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులతో పాటు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

జాతీయస్థాయి ఆట్యాపాట్యా పోటీలకు గురుకుల విద్యార్థి

సాలూరు: మండలంలోని పీఎన్‌బొడ్డవలసలో గల డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి జాతీయస్థాయి ఆట్యాపాట్యా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, పీడీ విద్యాసాగర్‌లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలులోని డీఎస్‌ఏ స్టేడియంలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగిన 9వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల ఆట్యాపాట్యా పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లా జట్టుకు బెస్ట్ ఎమర్జింగ్ టీమ్ అవార్డు దక్కిందని తెలిపారు. ఈ జట్టులో ఉన్న పీఎన్ బొడ్డవలస పాఠశాలకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి వాసు మంచి ప్రతిభ కనబరిచి, నవంబరు నెల 5,6,7 తేదీలలో పాండిచ్చేరిలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపియ్యాడని పేర్కొంటూ జాతీయస్థాయి పోటీల్లోను ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

28న ఐటీఐ నాల్గో విడత కౌన్సెలింగ్

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 28న ఉదయం 10 గంటల నుంచి మిగులు సీట్లకు నాలుగోవిడత కౌన్సెలింగ్ ఉంటుందని ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 27వ తేదీలోగా ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎల్రక్టానిక్స్, మెకానిక్, వెల్డర్, కోపా కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, వివరాలకు ఫోన్ 9390063881, 9491134464 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోస్టర్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దుదాం

విజయనగరం: పోస్టర్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య బుధవారం ఓ ప్రకటనలో కోరారు. నగర పరిధిలో ఎక్కడా పోస్టర్లు, గోడలపై రాతలు చేపట్టరాదన్నారు. పోస్టర్లు అతికించేవారి నుంచి రూ.5వేలు అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి పోస్టర్లు అతికించిన సంస్థ నుంచి రూ.5వేలు అపరాధ రుసుము విధించి వసూలు చేశామని చెప్పారు.

ఫేక్ రిసీప్ట్‌తో డ్రామా..!

- బ్యాంకులో డబ్బులు జమకాక బయటపడిన బాగోతం
- సీఎఫ్ కుమారి ఫిర్యాదుతో బ్యాంకు మేనేజర్ తనిఖీ


బ్యాంకు వద్ద ఉన్న బీసీ పాయింట్‌లో కట్టినట్లు ఇచ్చిన ఫేక్ రిసీప్ట్


బీసీ పాయింట్‌లో డబ్బులు కడితే వచ్చే ఒరిజినల్ రిసీప్ట్

వీరఘట్టం: మండలంలోని పాలమెట్టకు చెందిన ఓ మహిళ స్త్రీనిధి రుణం తీసుకుంది. కట్టాల్సిన వాయిదాను ప్రతినెలా ఆమె భర్త బ్యాంకు దగ్గర ఉన్న బిజినెస్ కరస్పాండెంట్(బీసీ) వద్ద కడుతూ రిసీప్ట్ తీసుకుంటూ, వారి రికార్డుల్లో సంతకం చేస్తున్నాడు. ఎప్పటి లాగా ఈనెలలో కూడా 12 వ తేదీన వీరఘట్టం యూనియన్ బ్యాంకు వద్ద ఉన్న బిజినెస్ కరస్పాండెంట్ వద్ద రూ.15 వేలు కట్టిన రిసీప్ట్‌ను పాలమెట్ట గ్రామానికి చెందిన సీఎఫ్ కుమారికి ఇచ్చాడు. ఆ సంఘం బ్యాంకు ఖాతాలో అప్పటివరకు రూ.45 వేలు ఉండేవి. ఆయన కట్టిన రూ.15 వేలతో రూ.60 వేలు ఉండాలి. స్త్రీనిధిలో రూ.60 వేలు ఉందికదా ఈ డబ్బులను స్త్రీనిధి ఖాతా నుంచి డ్వాక్రా మహిళలకు చెందిన గ్రామ సంఘం ఖాతాలోకి మళ్లించేందుకు సీఎఫ్ కుమారి మంగళవారం వీరఘట్టంలోని యూనియన్ బ్యాంకు వద్దకు వచ్చి రూ.60 వేలు విత్‌డ్రా చేద్దామనుకుంది. అయితే బ్యాంకు ఖాతాలో మాత్రం రూ.45 వేలే ఉన్నట్లు అధికారులు తెలపడంతో సీఎఫ్ కుమారి నివ్వెరపోయింది.

బయటపడిన ఫేక్ బాగోతం..

పాలమెట్ట గ్రామానికి చెందిన వ్యక్తి బీసీ పాయింట్‌లో రూ.15 వేలు కట్టినట్లు ఇచ్చిన రిసీప్ట్‌ను సీఎఫ్ కుమారి బ్యాంకు అధికారులకు చూపించడంతో అధి ఫేక్ రిసీప్ట్ అని బ్యాంకు మేనేజర్ ప్రధాన్ నిర్ధారించడంతో అసలు బాగోతం బయటపడింది. బుధవారం సదరు వ్యక్తిని సీఎఫ్ కుమారి బ్యాంకుకు పిలిపించడంతో బ్యాంచ్ మేనేజర్ ఆ వ్యక్తిని ప్రశ్నించారు. ఈ ఫేక్ రిసీప్ట్‌తో మీరు ఎవరిని మోసం చేద్దామనుకుంటున్నారని నిలదీయడంతో, ఈనెల 12న తమషాపులో పనిచేసే కుర్రవాడికి డబ్బులు కట్టమని ఇచ్చినట్లు సదరు వ్యక్తి సమాధానం చెప్పాడు. బీసీ పాయింట్‌లో డబ్బులు కట్టినట్లు ఫేక్ రిసీప్ట్ తయారు చేయించిన వ్యక్తిని వెంటనే తీసుకురావాలని బ్రాంచ్ మేనేజర్, బీసీ పాయింట్ నిర్వాహకులు సూచించారు. అయితే సదరు వ్యక్తి పత్తా లేకుండా పోయాడని బీసీ పాయింట్ నిర్వాహకురాలు సునీత తెలిపారు. ఈ వ్యక్తే తప్పుడు రసీదుతో మమ్మల్ని మోసం చేద్దామని అనుకుంటున్నాడని, వీరఘట్టంలో నడుపుతున్న తన నెట్ సెంటర్‌లో ఇటువంటి ఫేక్ రిసీప్ట్‌ను తయారు చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. గతంలో కూడా డ్వాక్రా డబ్బులు రూ.30 వేల వరకు మింగేశాడని, గ్రూప్ సభ్యులు నిలదీయడంతో తప్పిపోయిందని చెప్పి డబ్బులు కట్టేసినట్లు గతంలో ఇదే వ్యక్తి చేసిన మోసాన్ని సీఎఫ్ గుర్తు చేశారు.

గుర్రం జాషువా కవితా పురస్కారానికి 'గంటేడ' ఎంపిక


గంటేడ గౌరినాయుడు

కొమరాడ: నవయుగకవి చక్రవర్తి గుర్రంజాషువా 129వ జయంతి సందర్భంగా 2024 గుర్రంజాషువా కవిత పురస్కారానికి ఉత్తరాంధ్రలోని పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ప్రముఖ కథారచయిత, సాహితీ వేత్త, గేయ రచయిత, గంటేడ గౌరునాయుడు ఎంపికైనట్లు గుర్రంజాషువా విజ్ఞాన కేంద్రం వారు ఒక ప్రకటనలో తెలిపారు.గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, ప్రజానాట్యమండలి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 27న గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో గౌరునాయుడు, డాక్టర్ ఆచార్య గుమ్మ సాంబశివరావులకు ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన సాహితీవేత్తలు మంచుపల్లి శ్రీరాములు, పల్ల పర్శినాయుడు, జి.రామకృష్ణ, జగదీష్, స్వామినాయుడు తదితర రచయితలు, ఉపాధ్యాయులు సాహితీ అభిమానులు గంటేడ గౌరునాయుడిని అభినందించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జీఎంఆర్ ఐటీ విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

రాజాం/రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలో చక్కని ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు అమలాపురంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించిన పోటీల్లో జూనియర్, సబ్‌జూనియర్ పోటీల్లో విభాగాల్లో విజయనరం జిల్లా తరఫున జీఎంఆర్ ఐటీ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. జూనియర్ విభాగానికి సంబంధించి 63 కేజీల విభాగంలో ఎస్.కృష్ణవేణి, 52 కేజీల విభాగంలో బి.నిహారికలు బంగారు పతకాలు, అలాగే సబ్ జూనియర్ విభాగానికి సంబంధించి 63 కేజీల విభాగంలో ఎన్.రచిత, 59 కేజీల విభాగంలో వి.శరత్ బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఓవరాల్ చాంపియన్ షిప్‌లో సబ్ జూనియర్ పురుషుల జట్టు మొదటి స్థానం సాధించగా జూనియర్, సబ్‌జూనియర్ మహిళల జట్టు తృతీయ స్థానంలో నిలిచాయని వివరించారు. 59 కేజీల విభాగంలో పి.సూరజ్‌కుమార్, 52 కేజీల విభాగంలో జి.సాత్విక సిల్వర్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. 105 కేజీల విభాగంలో జి.నవదీప్ సబ్ జూనియర్ విభాగంలో, ఎస్.సాయిసుధీర్ జూనియర్ విభాగంలో, 76 కేజీల జూనియర్ విభాగంలో పి.దీపిక, 52 కేజీల జూనియర్ విభాగంలో పి.గాయత్రిరెడ్డిలు రజత పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభపట్ల ప్రిన్సిపాల్‌తో పాటు ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, పీడీ డాక్టర్ బి.అరుణ్‌కుమార్‌లు అభినందించారు.

15 కిలోల గంజాయి స్వాధీనం

- ఆరుగురు నిందితుల ఆరెస్ట్


నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టిన డీఎస్పీ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని గాదెలమర్రివలస గ్రామం జంక్షన్ లో గంజాయితో పట్టుబడిన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆయన స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బుదరాయవలస ఇన్‌చార్జ్ ఎస్సై బి.లోకేశ్వరరావు సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా సిగిరివెంకటేష్, జరజాన శ్రీరామ్, బైక్‌పై వస్తుండగా వారిని ఆపి రికార్డులు గురించి ఆరా తీస్తున్నారు. అదే సమయంలో వెనక నుంచి ఆటోలో వస్తున్న నలుగురు వ్యక్తులు ఆటో దిగి పరుగు తీశారు. ఇది గమనించిన పోలీసులు వెంటనే స్పందించి ఆ నలుగురిని పట్టుకుని ఆటో తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఆటోలో గంజాయిని తరలిస్తున్న వెంకటేష్ (రంగపువలస) జరజాన శ్రీరామ్ (పెరుమాళి) అలాగే పాచిపెంట మండలం ఏసుపురం గ్రామానికి చెందిన పిడిసి చిన్నారావు, రాజాం మండలం ఒమ్మి గ్రామానికి చెందిన ఒప్పింటి నాగరాజు, మెరకముడిదాం మండలం గాదెలమర్రివలస గ్రామానికి చెందిన వలిరెడ్డి సత్యనారాయణలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు వివరించారు. నిందితుల దగ్గర 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒక బైక్, ఒక ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి సీఐ శంకర్రావు, బుదరాయవలస ఇన్‌చార్జ్ ఎస్సై బి.లోకేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..!

- ఆన్‌లైన్ వర్క్ పేరుతో పోగొట్టుకున్న డబ్బులు
- అకౌంట్ నుంచి రూ.7.50 లక్షలు మాయం
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు


రాజాం సిటీ: ప్రజల అవసరాలను బలహీనతగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలు అనుసరించి మాయలవలను విసురుతున్నారు. ఎలాగోలా సెల్‌ఫోన్ వేదికగా బురిడీ కొట్టించి జేబులు గుల్ల చేస్తున్నారు. ఇటువంటి ఘటనే టెలిగ్రాం వేదికగా ఏకంగా ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బురిడీ కొట్టించి రూ.7.50లక్షలు కాజేశారు. వివరాల్లోకి వెలితే టెలిగ్రాంలో పరిచయమైన అపరిచితుడు పంపిన లింకును క్లిక్ చేసి పట్టణ పరిధిలోని తెలగవీధికి చెందిన బి.వెంకటేష్ అనే వ్యక్తి సైబర్ వలకు చిక్కి ఏకంగా రూ.7.50 లక్షలు పోగొట్టుకున్నాడు. దీనికి సంబంధించిన అందిన ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ కె.అశోక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ పరిధిలోని తెలగవీధికి చెందిన వెంకటేష్ కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ ఓ కన్సల్టెన్సీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. అయితే తన తల్లికి అనారోగ్యం కారణంగా నెల రోజుల క్రితం రాజాం వచ్చి వర్క్‌ఫ్రం హోం చేస్తున్నాడు. ఈ క్రమంలో టెలిగ్రాం అకౌంట్‌లో అపరిచిత వ్యక్తి పరిచయమయ్యాడు. ఈ నెల 12న గాయత్రిపీసా అనే అకౌంట్ నుంచి ప్రొడక్ట్ ప్రమోషన్ పార్ట్‌టైం జాబ్ ఉందని మెసేజ్ వచ్చింది. ఇన్విటేషన్ కోడ్ ద్వారా లాగిన్ అవ్వాలని ఒక లింకు పంపారు. దీంతో లాగిన్ అయిన తరువాత రూ.10వేలు జమచేశాడు. వెంటనే సదరు నేరగాళ్లు ఆయనకు రూ.900లు కమిషన్ ఇవ్వగా ఈ మొత్తాన్ని తన యూనియన్ బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. తరువాత రోజు లాగిన్ కాకపోవడంతో గాయత్రి పేరుతో సదరు వ్యక్తి వాట్సాప్ నంబర్‌కు ఏమైనా సమస్య ఉందా లాగిన్ కాలేదని మెసేజ్ చేశారు. దీంతో మళ్లీ లాగిన్ అయి రూ. 10వేలు డిపాజిట్ చేశాడు. దానికి మళ్లీ రూ. 4వేలు కమిషన్ ఇచ్చారు. 15వతేదీన రూ. 33వేలు జమచేయగా రూ.7వేలు కమిషన్ ఇచ్చారు. మొత్తం రూ.40వేలను బ్యాంకు నుంచి విత్‌డ్రా చేశాడు.

తక్కువ మొత్తానికి ఎక్కువ బోనస్..!

ఆ తరువాత టెలిగ్రాం కస్టమర్ ఐడీల ద్వారా లింకులు పంపించి తక్కువ మొత్తంలో జమచేస్తే ఎక్కువ మొత్తంలో బోనస్ ఇస్తామని చెప్పడంతో ఆశపడిన సదరు వ్యక్తి తన వద్ద ఉన్న మొత్తాన్ని తన బ్యాంకు అకౌంట్‌లు, యూపీఐలతోపాటు పలు విధాలుగా సైబర్ నేరగాళ్లకు 7,49,338లు చెల్లించాడు. అనంతరం ప్రమోషన్ వర్క్ చేయగా ఎంకే (మిచెల్ కోర్స్) కంపెనీలో క్రియేట్ చేసిన అకౌంట్‌లో రూ.2,81,724లు బోనస్‌తో కలిపి రూ.10,31,062లు చూపించింది. వాటిని విత్ డ్రా చేసేందుకు ప్రయత్నించగా రూ. 5,15,531లు అదనంగా డిపాజిట్ చేయాలని కస్టమర్ సర్వీసెస్ ద్వారా మెసేజ్ వచ్చింది. దీంతో అనుమానం వచ్చిన ఆయన ఈ నెల 16న రాత్రి 10 గంటల సమయంలో సైబర్ క్రైం నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. అనంతరం బుధవారం పోలీస్‌స్టేషన్ వచ్చి సదరు ఎంకే ప్రమోషన్స్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడని సీఐ అశోక్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అపరిచిత లింకులు క్లిక్ చేసి మోసపోవద్దని హితవు పలికారు. సైబర్ నేరగాళ్ల వలకు చిక్కకుండా జాగ్రత్తపడాలని సూచించారు.

3 అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

- రూ.40వేల జరిమానా


అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామం వద్ద వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న 3 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు.మంగళవారం అర్ధరాత్రి అలజంగిగ్రామం నుంచి బొబ్బిలికి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారన్న సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు గొల్లపల్లి వద్దనున్న స్థానిక దాడితల్లి అమ్మవారి గుడిసమీపంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.బుధవారం తహసీల్దార్‌కు విషయం తెలియజేయగా ఆయన మొదటిసారిగా దొరికిన రెండు ట్రాక్టర్లకు రూ.10వేలు చొప్పున, రెండోసారి దొరికిన ఓ ట్రాక్టర్‌కు రూ. 20వేలు మొత్తం రూ.40వేలు జరిమానా విధించారు. మరో మారు ఇసుక అక్రమ రవాణాలో దొరికితే ఆర్‌సీ రద్దుచేస్తామని తహసీల్దార్ శ్రీను స్పష్టం చేశారు.